క్లుప్తంగా

సీఎం, డీప్యూటీ సీఎం ఫొటోలకు స్టిక్కర్లు



తోట్లవల్లూరు: సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఫొటోలు కనిపించకుండా మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తెలుపు స్టిక్కర్లు అతికించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎంపీడీఓ రవికాంత్ ఆదేశాలతో కార్యాలయ సిబ్బంది గురువారం సీఎం, డిప్యూటీ సీఎం చిత్ర పటాలకు స్టిక్కర్లు వేయటంతోపాటు కార్యాలయ ఆవరణలోని రాజకీయపార్టీల పోస్టర్లను, బొమ్మలను తొలగించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



కూచిపూడి(మొవ్వ): ఎస్టీయూ ఆధ్వర్యంలో మొవ్వ మండలంలోని 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను గురువారం పంపిణీ చేశారు. మండలంలోని ఎనిమిది జిల్లా పరిషత్ పాఠశాలలు, ఒక ఎయిడెడ్ పాఠశాలలోని 470 విద్యార్థులకు అందజేసినట్లు నాయకులు తెలిపారు. కూచిపూడిలోని శ్రీ సిద్ధేంద్ర జెడ్పీ హైస్కూల్లో హెచ్‌ఎం వెంకటసత్య ప్రసాద్ పర్యవేక్షణలో ఎస్టీయూ నాయకులు పుస్తకాలను అందజేశారు. ఆ యూనియన్ జిల్లా ఆర్థిక కార్యదర్శి కొణతం మాధవరావు, నాయకులు శ్రీనివాసరావు, వెంకట శ్రీనివాసరావు, శ్రీనివాసులు, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో గుర్రపు డెక్క తొలగింపు



గుడ్లవల్లేరు: శేరీ దగ్గుమిల్లి శివారు తాడిచెర్లలోని గ్రామ పంచాయతీ చెరువులోని గుర్రపు డెక్కను ఎంపీడీఓ టి.విజయసారథి ఆదేశాల మేరకు గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఏఈ రూపేష్, గ్రామ కార్యదర్శి కరీమ్ తొలగింపు పనులను చేపట్టారు. తనకు వచ్చిన గ్రామస్తుల ఫిర్యాదుల మేరకు ఎంపీడీఓ బుధవారం రూపేష్, కరీమ్‌ను ఆదేశించటంతో ఈ పనులను నిర్వహించారు.

పశు వైద్య శిబిరాలు వినియోగించుకోవాలి



మండవల్లి: ఉచిత పశు వైద్య శిబిరాలను పశుపోషకులు వినియోగించుకోవాలని పశుసంవర్థక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ వరప్రసాద్ అన్నారు. మండలంలోని గన్నవరం, చావలిపాడు గ్రామాల్లో గురువారం పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 41 పశువులకు చికిత్సలు అందించారు. కానుకొల్లు, చావలిపాడు డాక్టర్లు రామకృష్ణ, ప్రదీప్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షన్ లబ్ధిదారుల వివరాల తనిఖీ



మొవ్వ: మండలంలో వృద్ధాప్య పింఛన్ లబ్ధిదారుల వివరాలను గురువారం అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. మండలంలోని వైద్యాధికారులు డాక్టర్ మహిత, డాక్టర్ విజయకుమార్, డాక్టర్ సాయికిరణ్ సహకారంతో జిల్లా కేంద్రం నుంచి తరలివచ్చిన వైద్యాధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఎంపీడీఓ విమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారుల అభివృద్ధికి కృషి



ముదినేపల్లి రూరల్: పాల ఉత్పత్తిదారుల ఆర్థికాభివృద్ధికి కృష్ణా మిల్క్ యూనియన్ కృషి చేస్తున్నట్లు యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. యూనియన్ వజ్రోత్సవాల్లో భాగంగా మండలంలోని గురజ పాల ఉత్పత్తిదారుల సంఘ సభ్యులతో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం యూనియన్ బోనస్, సంఘ బోనస్‌తో కలుపుకుని సగటున లీటర్ గేదె పాలకు రూ.64, ఆవు పాలకు రూ.41 చెల్లిస్తున్నట్లు చెప్పారు. సంఘంలోని సభ్యులను చైర్మన్ శాలువాలతో సత్కరించారు. యూనియన్ పాలకవర్గ సభ్యుడు వల్లభనేని సుబ్బారావు, అర్జా వెంకట నగేష్, గుడ్లవల్లేరు పాలశీతలీకరణ మేనేజర్ తోట సత్యనారాయణ పాల్గొన్నారు.

రేషన్ కార్డులు ఎప్పుడు ఇస్తారో..!

- ఎన్నికల హామీలను గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం
- రేషన్ కార్డుల కోసం అర్హుల ఎదురుచూపులు



రేషన్‌కార్డులు

పామర్రు: నియోజకవర్గంలో అర్హులైన వారికి రేషన్ కార్డులను నెలలు కాలంగా మంజూరు చేయలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాల ఊసెత్తడం లేదని మరోపక్క లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో అందిన సంక్షేమ పథకాలు ప్రస్తుతం అందని ద్రాక్షగా మారాయని అంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడు నెలలవుతున్నా పథకాల అమలుపై కనీసం దృష్టి సారించకపోవడం దారుణమని చర్చించుకుంటున్నారు.

రేషన్ కార్డులే ఆధారం

పేద, మధ్య తరగతి కుటుంబాలకు రేషన్ కార్డే ప్రధాన ఆధారం. దీని ప్రాధాన్యతను గుర్తించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి ఏటా జూన్, డిసెంబర్ నెలల్లో రేషన్ కార్డులు అర్హులకు అందజేసేది. అంతేకాకుండా అత్యవసర పరిస్థితుల్లో రోజుల వ్యవధిలోనే రేషన్ కార్డులు మంజూరు చేసేది. కొత్తగా వివాహం చేసుకున్న జంటలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి తమ స్వగ్రామాలకు వచ్చి ఏ ఆధారం లేని కుటుంబాల వారు కూడా ప్రస్తుతం దరఖాస్తుదారుల్లో ఉన్నారు. అయితే కూటమి ప్రభుత్వం కొత్త కార్డులపై ఎటువంటి ప్రకటన చేయకపోవడం, నూతన దరఖాస్తుదారులను ఆందోళనకు గురిచేస్తోంది. గ్రామ, వార్డు సచివాలయాల్లో కొత్త రైషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసేందుకు వెబ్ సైట్‌సైతం పని చేయకపోవడం గమనార్హం.

82,418 రేషన్ కార్డులు

పామర్రు నియోజకవర్గంలో ప్రస్తుతం 82,418 రేషన్ కార్డులు ఉన్నాయి.

వీటిలో గత ప్రభుత్వంలో మంజూరైన రేషన్ కార్డులు 3,241. కొత్త రేషన్ కార్డుల కోసం 1,560 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

సైట్ ఓపెన్ కావడం లేదు



గతంలో ఒకసారి రేషన్ కార్డుకోసం దరఖాస్తు చేస్తే రిజక్ట్ చేశారు. మళ్లీ దరఖాస్తు చేసుకుందామంటే ఆరు నెలలుగా సైట్ ఓపెన్ కావడం లేదని చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి రేషన్ కార్డుల సైట్‌ను ఓపెన్ చేసి దరఖాస్తులను స్వీకరించాలి

– వీ అనిల్‌కుమార్, పోలవరం

రేషన్‌కార్డు లేక ఇక్కట్లు



రేషన్ కార్డుకోసం దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయానికి వెళ్లా. సైట్ ఓపెన్ కావడం లేదని చెప్పారు. రేషన్ కార్డు లేక బియ్యం కొనుగోలు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నా. ప్రభుత్వం స్పందించి రేషన్‌కార్డు మంజూరు చేయాలి.

– కె.కుమారి, పామర్రు

ఉత్తర్వులు రాలేదు



ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత నుంచి ప్రభుత్వ సైట్ ఓపెన్ కావడం లేదు. కొత్తరేషన్‌కార్డులకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎటువంటి ఉత్తర్వులు రాలేదు. వెబ్‌సైట్ ఓపెన్ అయితే కార్డులకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది.

– జీ రవికాంత్, తహసీల్దార్, పామర్రు

ప్రజలను మోసం చేయడమే చంద్రబాబు పని



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గుడివాడ టౌన్: ప్రతి ఎన్నికల్లోనూ మోసపూరిత వాగ్దానాలు చేసి గెలిచిన తరువాత ప్రజలను మోసగించడం చంద్రబాబు నాయుడుకు కొత్త కాదని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు అన్నారు. ఆయన వ్యక్తిగత కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులతో కలసి మాట్లాడారు. 2024 ఎన్నికల్లో వాగ్దానాలు ఎన్నో చేసి ప్రజలను మోసం చేసి గెలిచారన్నారు. సూపర్–6 అంటూ ప్రజలను మభ్యపెట్టారన్నారు. అధికారంలోకి వచ్చాక క్రమక్రమంగా హామీలను నెరవేర్చే విషయాన్ని ప్రజల మనసుల్లో నుంచి తొలగించడానికి అనేక తప్పుడు మార్గాలను ఎంచుకున్నారన్నారు. ప్రజలు చంద్రబాబు మోసాలను గమనిస్తున్నారని, తిరిగి బుద్ధి చెప్పే సమయం దగ్గరలోనే ఉందని ఆయన తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఎంవీ నారాయణరెడ్డి, బాజీ, సయ్యద్, కె.ఆంజనేయ ప్రసాద్, శేఖర్, ప్రశాంత్, చిన్నా, రామ్మోహన్, యేషయ్య, పి.కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు



పోలింగ్ స్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలించిన అధికారులు

గుడివాడ టౌన్: త్వరలో జరగనున్న గుంటూరు–కృష్ణా జిల్లాల గ్యాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు ప్రారంభించినట్లు తహసీల్దార్ వి.రామకోటేశ్వరరావు తెలిపారు. గురువారం పట్టణంలోని ఏజీకే, ఎస్‌పీఎస్ మున్సిపల్ హైస్కూల్లో పోలింగ్ కేంద్రాలకు అనువైన గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పట్టణంలో మొత్తం 10 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అందులో మూడు ఏజీకే హైస్కూల్, 7 ఎస్‌పీఎస్ హైస్కూల్లో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ విష్ణుప్రసాద్, సీఐ నాగప్రసాద్, ఎలక్షన్ డీటీ లక్ష్మీ రాజకుమారి, ఆర్‌ఐ నాగబాబు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

మొవ్వ: ఫిబ్రవరి 27న జరిగే కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను మొవ్వ మండల అధికారులు గురువారం పరిశీలించారు. స్థానిక శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ హైస్కూల్లో జరిగే ఈ ఎన్నికల కోసం కేటాయించిన 167, 168 పోలింగ్ కేంద్రాల్లో వసతులను తహసీల్దార్ కే మస్తాన్, ఎంపీడీఓ జే విమాదేవి, కూచిపూడి ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం పరిశీలించారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: పట్టభద్రుల ఎన్నికలను పురస్కరించుకుని గుడ్లవల్లేరు మండలంలోని పోలింగ్ కేంద్రాలను అధికారులు గురువారం పరిశీలించారు. తహసీల్దార్ బి.లోకరాజు, ఎంపీడీఓ టి.వి జయసారథి, ఎస్‌ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ, ఆర్‌ఐ పి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరిస్తే సహించేది లేదు



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు ఆర్‌సీపీ రెడ్డి, తదితరులు

గుడివాడ టౌన్: విశాఖపట్నంలోని స్టీల్ ప్లాంట్ మూసేస్తాం, అమ్మేస్తాం, ప్రైవేటీకరిస్తాం అంటూ కేంద్ర ప్రభుత్వం పదేపదే ప్రచారం చేయడంలో మోసం దాగి ఉందని సీపీఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయడాన్ని అక్కడ ఉద్యోగులు 1,500 రోజులుగా ఆందోళన చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం టీడీపీ ఎంపీలపై ఆధారపడి కొనసాగిస్తున్న స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించకుండా వారు అడ్డుకోవడం లేదన్నారు. ఇది పూర్తిగా టీడీపీ ఎంపీల బాధ్యతారాహిత్యం అన్నారు. వెంటనే సొంత మైన్‌లు కేటాయించి, స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించకుండా ఆపాలని డిమాండ్ చేశారు. ఐద్వా కార్యదర్శి పి.రజిని. రైతు సంఘం నాయకుడు నీలం మురళీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సఫాయి కార్మికుల జీతాలు చెల్లించాలి



ధర్నా చేస్తున్న కార్మికులు

గుడివాడ టౌన్: గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సఫాయి కార్మికులుగా పనిచేస్తున్న వారికి బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ మహిళా కార్మికులు డిమాండ్ చేశారు. గురువారం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. సఫాయి కార్మికులను వాడుకుని కాంట్రాక్టర్ వారిని మోసం చేస్తున్నట్లు ఆరోపించారు. తక్షణమే ప్రభుత్వం ఈ విషయంలో జోక్యం చేసుకుని బకాయి జీతాలు చెల్లించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సీహెచ్. సత్యనారాయణ, సీపీఐ ఏరియా కార్యదర్శి గూడపాటి ప్రకాష్‌బాబు, యూనియన్ అధ్యక్షుడు లక్ష్మణరావు, వి.రమణమ్మ, కె.విజయలక్ష్మి, వి. ధనలక్ష్మి, ఎం.మేరమ్మ, డి. పద్మావతి, కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

సీసీ కెమెరాల పర్యవేక్షణలో కైకలూరు



మాట్లాడుతున్న ఎస్‌ఐ వెంకట్‌కుమార్

కైకలూరు: నియోజకవర్గంలో కైకలూరు పట్టణాన్ని సీసీ కెమెరాల పర్యవేక్షణలో నంబర్ వన్‌గా చెద్దామని కైకలూరు టౌన్ ఎస్‌ఐలు డి.వెంకట్‌కుమార్, ఆర్.శ్రీనివాస్ పేర్కొన్నారు. టౌన్ స్టేషన్‌లో బైక్, ఆటో మెకానిక్ దుకాణ యజమానులు, మెకానిక్‌లు కలిపి 54 మందికి సీసీ కెమెరాలపై గురువారం అవగాహన కల్పించారు. ఎస్‌ఐలు మాట్లాడుతూ కైకలూరును నమూనా ప్రాజెక్టుగా భావించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సీసీ కెమెరాలు ఎన్ని ఎక్కువ ఉంటే అంత మంది పోలీసు సిబ్బంది ఉన్నట్లుగా భావించాలన్నారు. అదేవిధంగా పట్టణంలో జాతీయ రహదారి సమీపంలో మెకానిక్ షాపులు వాహనాలను రోడ్డుపై నిలిపి రిపేర్లు చేస్తుండటం గమనించామన్నారు. దీని వల్ల ట్రాఫిక్ ఇబ్బందులతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం తథ్యం



క్రాంతికుమార్‌ను ఆహ్వానిస్తున్న దృశ్యం

కైకలూరు: ప్రతి విద్యార్థీ లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం తథ్యమని కైకలూరు అగ్నిమాపక అధికారి క్రాంతికుమార్ అన్నారు. ఆటపాక హోలీక్రాస్ స్కూల్లో ఇటీవల నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులను గురువారం అందించారు. ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో అనేక మార్పులు వచ్చాయన్నారు. సులభ బోధన పద్ధతులు అందుబాటులోకి వచ్చాయన తెలిపారు. అనంతరం స్కూల్ యాజమాన్యం క్రాంతికుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ప్రవీణ్, ప్రిన్సిపాల్ షెర్లిన్ పాల్గొన్నారు.

నేటి నుంచి వల్మీకేశ్వరీ ఆలయ వార్షికోత్సవాలు

పామర్రు: వల్మీకేశ్వరీ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు శుక్రవారం నుంచి ఫిబ్రవరి రెండో తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి గురువారం తెలిపారు. 31న లక్ష్మీ గణపతి పూజ, పంచామృతాభిషేకం, ఫిబ్రవరి 1న శ్రీ చక్ర హోమార్చన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వచ్చే నెల 2న అమ్మవారికి పుష్పాభిషేకం, సాయంత్రం గ్రామోత్సవం ఉంటుందని తెలిపారు.

నేడు కన్యకాపరమేశ్వరీ ఆత్మార్పణ దినోత్సవం

ముదినేపల్లి రూరల్: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వాసవీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు వట్టిమిల్లి ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, సామూహిక కుంకుమ పూజ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇదే రోజు రాత్రి జ్యోతుల ఊరేగింపుతో అమ్మవారికి పల్లకీ సేవ నిర్వహిస్తామని తెలిపారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

పామర్రు: ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్ సెల్ ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం గ్రీవెన్స్ సెల్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన ప్రజలు అర్జీలను ఎమ్మెల్యే అందజేశారు. కృష్ణాజిల్లా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, జనసేన పార్టీ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్ పాల్గొన్నారు.

మద్యం దుకాణానికి దరఖాస్తుల ఆహ్వానం

కైకలూరు: మండవల్లి మండలానికి గీత కులాల్లో రిజర్వ్ చేసిన మద్యం దుకాణానికి దరఖాస్తులను ఫిబ్రవరి 5వ తేదీ వరకు అందించవచ్చని కైకలూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ సీఐ ఎస్‌కే రమేష్ గురువారం తెలిపారు. 2024–2026 సంవత్సరానికి గాను గీత కులాల్లో ఉపకులమైన శెట్టిబలిజకు ఈ దుకాణం కేటాయించారని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు రూ.2 లక్షలు నాన్ రీఫండబుల్ రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలని తెలిపారు. ఇలా కట్టిన దరఖాస్తుదారులకు సంబంధించి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ నిర్వహించి విజేతకు షాప్ కేటాయిస్తామని పేర్కొన్నారు. జనరల్ షాప్‌కు చెల్లించే లైసెన్స్ ఫీజుల్లో సగమే ఫీజుగా ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. మొదటి ఏడాది 2024–25కి రూ.18,33,334, రెండో ఏడాదికి రూ.30,25,000 నిర్ణయించారని పేర్కొన్నారు. ఫిబ్రవరి 7న ఏలూరులో సురేష్ చంద్ర బహుగుణ పోలీస్ స్కూల్ ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు లాటరీ విధానంలో కేటాయింపు ఉంటుందని సీఐ తెలిపారు.

రేపటి నుంచి ఉచిత వైద్యశిబిరం

గుడ్లవల్లేరు: ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సీఎల్ వెంకట్రావు ఆధ్వర్యంలో గుడ్లవల్లేరులో శనివారం నుంచి రెండు రోజుల పాటు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈ వైద్య శిబిరంలో వివిధ రుగ్మతలతో బాధ పడుతున్న రోగులకు కార్పొరేట్ వైద్యం సైతం అందించే విధంగా వైద్య పరీక్షలు ఉంటాయని గురువారం డాక్టర్ వెంకట్రావు తెలిపారు.

మహాత్మా గాంధీకి ఘన నివాళి



తోట్లవల్లూరులో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు



గుడ్లవల్లేరులో బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసిన ప్రసాద్



పామర్రులో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా



గుడివాడలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ అధికారులు



కైకలూరులో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ



మొవ్వలో గాంధీ చిత్రపటానికి ఆర్యవైశ్య సంఘం సభ్యుల నివాళి

తోట్లవల్లూరు: జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమం తోట్లవల్లూరులో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంన గురువారం జరిగింది. స్థానిక వాసవీ ఆలయం వద్ద ఉన్న గాంధీ, అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాలకు ఆర్యవైశ్య సంఘం నాయకుడు తమ్మన ఉమామహేశ్వరరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు కొత్త శేష శ్రీనివాసరావు, వాసవీ ఆలయ చైర్మన్ తాడికొండ ఉదయ సూర్య సుధాకర్, నాయకులు తాడికొండ కృష్ణకుమార్, బాలాజీ, సుబ్బారావు, సందీప్ పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు : గాంధీ ఆశయాలను నెరవేర్చేందుకు ఈ తరం వారు భావి తరం వారికి చాటి చెప్పేవిధంగా బృహత్తర కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా లయన్స్ మాజీ గవర్నర్ వై.పి.సి.ప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం బాపూజీ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన గుడ్లవల్లేరులో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మొవ్వలో..

మొవ్వ: గాంధీ వర్ధంతిని సందర్భంగా మండల ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ జగన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి, వాసవి మాల చిత్రపటానికి పూల మాల వేసి ఆ సంఘ సభ్యులు నివాళులర్పించారు. వాసవీ క్లబ్ మొవ్వ ప్రెసిడెంట్ నంబూరి జగదీష్ కృష్ణ, వర్తక ప్రెసిడెంట్ నందిపాటి వెంకట నాగ రమేష్ పాల్గొన్నారు.

పామర్రులో..

పామర్రు: గాంధీజీ దేశానికి చేసిన సేవలను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి గురువారం నివాళులర్పించారు. నాయకులు ప్రవీణ్‌చంద్ర, గణేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: గాంధీ వర్ధంతి గురువారం పట్టణంలో జరిగింది. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము స్థానిక గాంధీ మండపంలోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావులు గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో టౌన్ హైస్కూల్ విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి 30 మందికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు కె. రామారావు, కార్యదర్శి బి. శ్రీనివాస్, పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: మహాత్మా గాంధీ ఆశయాలు ఎంతో గొప్పవని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ పీజేఎస్ మల్యాద్రి ఆధ్వర్యంలో గాంధీబొమ్మ సెంటర్‌లో గాంధీ విగ్రహానికి గురువారం నివాళులర్పించారు. కూటమి నేతలు వేంపాటి విష్ణురావు, పూలా రాజీ, జానీ, తోట లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

విద్యాంజలి కాలేజీలో..

నెహ్రూ యువ కేంద్రం, సాధన రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో కైకలూరు విద్యాంజలి కాలేజీలో గాంధీ వర్ధంతి నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు ముఖ్య అతిథిగా విచ్చేసి గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సాధర సంస్థ డైరెక్టర్ పాముల ఏసుపాదం, ప్రిన్సిపాల్ జమీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.